క్లుప్తంగా

ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఆదిమల్ల దేవేందర్



కనగల్ : బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన ఆదిమల్ల దేవేందర్ నియామకమయ్యారు. మంగళవారం దేవేందర్‌కు జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ కనగల్ మండల కేంద్రంలో నియామక పత్రం అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల : వెలిమినేడు గ్రామంలో హైవే రోడ్డు వెంట గల షాప్స్ అండ్ స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా లోడే చిరంజీవి, ఉపాధ్యక్షులుగా చింతకాయల శివకృష్ణ, నాతి శ్రీను, పున్న మురళి, సహాయ కార్యదర్శిగా మామిడి యాదయ్య, జోరిగల నరేందర్, ఎగ్గే లింగస్వామి, కోశాధికారిగా తోట రాము, గౌరవాధ్యక్షులుగా నేలంటి వెంకటరమణ, రామకృష్ణారెడ్డిలు ఎన్నికయ్యారు.

మత్స్యకారుల సంఘం కార్యదర్శిగా బాలప్ప

చిట్యాల : పట్టణానికి చెందిన గొడుగు బాలప్పను తెలంగాణ ముదిరాజ్ మత్స్యకారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకన బోయిన రమణముదిరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలప్ప మాట్లాడుతూ జిల్లాలో ముదిరాజ్ మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాలి

మునుగోడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను ఎత్తివేయాలని ప్రయత్నిస్తున్నాయని, ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతి కార్మికుడు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను కోరారు. మంగళవారం మునుగోడు సీపీఐ కార్యాలయంలో జరిగిన తాపీ కార్మికుల మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లం శివయ్య, యాదయ్య, స్వామి, నర్సింహ, వెంకన్న, నగేష్, దొమ్మాటి గిరి, ఉప్పు రమణయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణ మార్బుల్, పాలిష్ స్టోన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎస్.హరి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, కార్యదర్శిగా క్రాంతి నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులకు మంగళవారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు దాసరి దేవయ్య నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భిక్షం, సైదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : పట్టణంలో 11 కేవీ విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకుతున్నందున, వాటిని తొలగించేందుకు బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు మార్కెట్ రోడ్, పన్నాలగూడెం, సుందరయ్యనగర్, బాబసాహెబ్‌గూడెం, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి గణేష్ తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్లు అందజేత

కనగల్ : మండల పరిధిలోని బుడుమర్లపల్లి శ్రీ అక్కెనపల్లి వెంకటేశ్వరరావు ఆదర్శ పాఠశాలలో 2023 బ్యాచ్ ఎన్‌సీసీ విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా 2023–24 సంవత్సరానికి గాను ఎన్‌సీసీ విద్యార్థుల కోసం నూతన ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 31(టీ) బీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, సుబేదార్ మేజర్ మాధవరావు, నాయక్ సుబేదార్ జగన్నాథం, హవల్దార్ సంతోష్, బల్జీత్‌సింగ్, పాఠశాల ప్రిన్సిపాల్ మమత, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ స్వరూప్‌రెడ్డి, కవిత పాల్గొన్నారు.

సదరం క్యాంప్‌ను వినియోగించుకోవాలి

నాంపల్లి : శారీరక, మానసిక దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహిస్తున్నారని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేషుకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3, 8, 22, 29, 31 తేదీల్లో శారీరంలోపం ఉన్న వారికి, 9, 17 తేదీల్లో కంటి సంబంధిత సమస్యలు ఉన్నవారికి, 16, 24 తేదీల్లో వినికిడి లోపం ఉన్నవారికి, 10న బుద్ధిమాంద్యం ఉన్న వారికి క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని అన్నారెడ్డిగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్డీఓ రవికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య మాజీ సర్పంచ్ బోదనపు వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ నిర్ణయం అప్రజాస్వామికం

కేతేపల్లి : ప్రభుత్వ పాఠశాలలకు బయట వ్యక్తులు రావొద్దని విద్యాశాఖ నిర్ణయించడం అప్రజాస్వామి కమని ఎన్‌ఎస్‌యూఐ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లి అంజన్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన కొర్లపహాడ్ మోడల్ స్కూల్‌ను విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి సందర్శించి మాట్లాడారు.

పశు వైద్య సేవలపై పట్టింపేది!

- గత డిసెంబర్ తర్వాత అందని మందులు
- పలు వైద్యశాలల్లో పోస్టులు ఖాళీ
- ఇబ్బందులు పడుతున్న రైతులు

చిట్యాల : మండలంలోని పశు వైద్యశాలల్లో జీవాలకు అవసరమైన మందులు లేకపోవడంతో పాడి రైతులకు, గొర్రెల, మేకల పెంపకందారులకు ఇబ్బందిగా మారింది. పాడి పశువులకు, ఇతర జీవాలకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. చిట్యాల మండలవ్యాప్తంగా సుమారు 11,935 పాడి పశువులు, గొర్రెలు, మేకలు 39,043 ఉన్నాయి. వీటి అవసరాలకుగాను ప్రతి మూడు నెలలకోమారు పశు వైద్యశాలలకు మందులు సరఫరా చేయాల్సి ఉంది. కానీ గత ఏడాది డిసెంబర్ నెల తర్వాత ఇప్పటి వరకు మందులు సరఫరా కాలేదు. ప్రతి మూడు నెలలకోమారు పశు వైద్యశాలలకు మందులు సరఫరా కావాల్సి ఉంది. కాగా తొమ్మిది నెలలుగా పశు వైద్యశాఖ నుంచి మందులు, వాక్సిన్లు, ఇంజెక్షన్లు సరఫరా కాలేదు. దీంతో గతంలో వచ్చిన మందులను పశు వైద్య అధికారులు సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. దీంతో పాడి పశువులకు, గొర్రెలకు, మేకలకు పశువైద్య సిబ్బంది సరైన వైద్య సేవలు అందించలేకపోతున్నారు. ముఖ్యంగా పాడి పశువులు ఎదకొచ్చే మందులు, గాలికుంట వ్యాధి నివారణ టీకాలు, మూతి వాపు టీకాలు, దొబ్బ వ్యాధి నివారణ, రొమ్ము వాపు నివారణకు అవసరమైన యాంటి బయాటిక్స్ అందుబాటులో లేకపోవడంతో పాడి రైతులు ప్రైవేటు మెడికల్ స్టోర్స్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. పశువైద్యశాలలకు అవసరమైన మందులను, టీకాలను, ఇంజెక్షన్‌లను ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని పాడి రైతులు, జీవాల పెంపకందారులు కోరుతున్నారు.



వైద్య సిబ్బంది లేని పెద్దకాపర్తి పశు వైద్యశాల

మూతపడనున్న పశువైద్యశాల!

మండలంలోని పెద్దకాపర్తి పశువైద్యశాలలో సరైన పశువైద్య సిబ్బంది లేకపోవడంతో మూతపడే పరిస్థితి నెలకొంది. రెండేళ్లుగా ఈ పశువైద్యశాలలో ఎల్‌ఎస్‌ఏ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్నాళ్లు ఈ ఆస్పత్రిలోని అటెండర్ పాడి పశువులకు, జీవాలకు వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. కాగా గత సోమవారం ఆ అటెండర్ పదవీ విరమణ చేశారు. ఈ పశు వైద్యశాలలో సిబ్బంది లేకపోవడంతో ఇకపై పశు వైద్య సేవలు అందించే పరిస్థితి లేదు. పెద్దకాపర్తి పశువైద్యశాలకు సిబ్బందిని వెంటనే కేటాయించాలని ఆ గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మరిన్ని సమస్యలు..

చిట్యాల పట్టణంలోని పశు వైద్యశాలకు సంబంధించిన విద్యుత్ బిల్లు గత ఏడాది సెప్టెంబర్ నెల నుంచి చెల్లించలేదు. అదేవిధంగా మండలంలోని ఏపూరు, ఉరుమడ్ల గ్రామాల్లోని పశు వైద్యశాలల్లో సైతం విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. గుండ్రాంపల్లిలోని పశు వైద్యశాలకు మాత్రం దాతల సహకారంతో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. కాగా గుండ్రాంపల్లిలోని పశు వైద్యశాలలో సైతం అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. పాడి పశువులకు, జీవాలకు అవసరమైన మందులు, వాక్సిన్లు, ఇంజెక్షన్లు అందజేయాలని పశు వైద్యశాలలకు మౌలిక వసతులను, పశువైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని మండలంలోని పాడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సిబ్బందిని కేటాయించాలి



పెద్దకాపర్తి గ్రామంలో కొన్నేళ్ల క్రితం సొంత భవనంలో పశు వైద్యశాల ఏర్పాటు చేశారు. అయితే రెండేళ్లుగా సరైన పశు వైద్య సేవలు అందడం లేదు. అవసరమైన మందులు లేకపోగా ప్రస్తుతం పశు వైద్య సిబ్బంది సైతం లేరు. మా గ్రామంలోని పశు వైద్యశాలకు సిబ్బందిని కేటాయించి పాడి పశువులకు సరైన వైద్య సేవలు అందించాలి.

– గంట్ల పుల్లారెడ్డి, పాడి రైతు, పెద్దకాపర్తి

నివేదిక అందజేశాం

మండలంలోని పశు వైద్యశాలలకు గత డిసెంబర్‌లో మందులు సరఫరా అయ్యా యి. మందుల కోసం జిల్లా అధికారులకు నివేదిక అందజేశాం. ఒకటి, రెండు రోజుల్లో మందులు చిట్యాల మండలంలోని పశువుల ఆస్పత్రులకు సరఫరా కానున్నాయి. మండలంలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం.

– జిల్లా అమరేందర్, చిట్యాల పశువైద్యాధికారి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

నకిరేకల్ : విద్యార్థులు తమ ఇంటి ఎదుట విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సూచించారు. నకిరేకల్‌లోని ఆఫీసర్స్ కాలనీలో శ్రీ చైతన్య స్కూల్ ఆవరణలో మంగళవారం ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పట్టణంలో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతిఏటా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతోందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి, వార్డు కౌన్సిలర్ పోతుల సునీత రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుర్రం గణేశ్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు యల్లపురెడ్డి సైదిరెడ్డి, ప్రగడపు నవీన్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్ అండ

కేతేపల్లి : ప్రతి కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని భీమారం గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులతోపాటు వివిధ పార్టీలకు చెందిన 80 మంది మంగళవారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు మద్దతుగానే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో వార్డు సభ్యులు, నాయకులు కోట విజయ, సైదులు, కోట శ్రీను, ఈట మహేష్, కోట సతీష్, రమేష్, గూడపూరి పాపయ్య, బాల తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి : పేదింటి ఆడబిడ్డ తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ పులి సైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు యాణాల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీలు దుబ్బాక పావని శ్రీధర్, అంజయ్య, వాజిద్, సర్పంచ్‌లు గోసుల భద్రాచలం, కర్నాటి ఉపేందర్, బద్దం వరలక్ష్మి రాంరెడ్డి, ఆదిమల్ల లింగస్వామి, మాదగోని అండాలు నర్సింహ, మేడి పుష్పలతశంకర్, ఉప్పల అనంతలక్ష్మి, అల్లుబెల్లి ఇందిరమ్మ సత్తిరెడ్డి, ఆర్‌ఐ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి

హోంగార్డులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

చిట్యాల : పోలీస్ శాఖలో పనిచేస్తున్న హోంగార్డులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు చిట్యాల, నార్కట్‌పల్లి, రామన్నపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న హోంగార్డులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు మేడి యాదయ్య, రమేష్, దేవరకొండ అశోక్‌చారి, మల్లేష్, సందీప్, నర్సింహ, దేవేందర్, రవి పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



కట్టంగూర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సునిత

కట్టంగూర్ : తల్లిపాలు అమృతంతో సమానమని ఎంపీడీఓ పొరెళ్ల సునిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టాలని సూచించారు. ముర్రు పాలు పట్టడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారద, పద్మావతి, ఏపీఎం వినోద, హెల్త్‌సూపర్‌వైజర్ మేరీ, ఏఎన్‌ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన

మర్రిగూడ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యశోద మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల తరువాత అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, విమలాదేవి, లక్ష్మి, ఆశవర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : అమ్మనబోలు గ్రామంలోని అంగన్‌వాడీ– 3వ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంపెల్లి సైదులు, అంగన్‌వాడీ టీచర్లు మహాలక్ష్మి, జయమ్మ, రేణుక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వీపర్ల సమ్మె

నల్లగొండ టూటౌన్ : తమ సమస్యలు పరిష్కరించి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మె మంగళవారం 34వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెడ్పీ సీఈఓకు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.నరసయ్యగౌడ్, ఎండి.సత్తార్, పి. ఎల్లయ్య, ఎండి.అనీఫ్, కె. యాదగిరి, పూలమ్మ, నాగయ్య, దేవి పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

నల్లగొండ టూటౌన్ : హరితహారం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పంకజ్‌యాదవ్, మెప్మా సీఓ అనిల్, దుర్గయ్య, ఉపేందర్, రత్నయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తా

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

మునుగోడు : ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తానని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామ ఎంపీటీసీ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఆ సమయంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు ఖర్చుచేసిన నగదు రూ.6 లక్షలు సీఎం సహాయ నిధి కింద ఎమ్మెల్యే మంజూరు చేయించి మంగళవారం సాలయ్య కుటుంబ సభ్యులకు అందించారు. అదేవిధంగా కల్వకుంట్ల గ్రామానికి చెందిన యాదయ్యకు మంజూరైన రూ. లక్ష విలువ గల చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలో పనిచేస్తూ ఏదైనా అనారోగ్యం, ఇతర కారణాల వల్ల కుటుంబ పెద్దను కోల్పోతే పార్టీ ఇన్సూరెన్స్‌తోపాటు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించే బాధ్యత తనదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తం రెడ్డి, పాల్వాయి జూనియర్ గోవర్ధన్ రెడ్డి, ఐతగోని విజయ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో తాగు నీటి సరఫరాపై నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి అన్నారు. మంగళవారం పానగల్ సమీపంలో ఉన్న మున్సిపాలిటీ పంప్‌హౌజ్ ఫిల్టర్ బెడ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంప్‌హౌజ్ మోటార్లు నిరంతరాయంగా నడుస్తున్నాయని, అవసరమైన సమయంలో వాడుకోవడానికి జనరేటర్ కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పంప్‌హౌజ్ నుంచి 16 ఎంఎల్‌డీ, రూరల్ పంప్‌హౌజ్ నుంచి 16 ఎంఎల్‌డీ తాగు నీరు పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షకాలం కావడంతో టర్బో, క్లోరిన్ టెస్ట్ శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు. నల్లాలకు మోటార్లు బిగిస్తే తొలగించాలని కోరారు. మోటార్ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ దిలీప్, రవీందర్, ఏసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పంప్‌హౌజ్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నార్కట్‌పల్లి : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడాన్ని హర్షిస్తూ నార్కట్‌పల్లి బస్ డిపో ఆవరణలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు దుబ్బాక పావని శ్రీధర్, ఎండీ వాజిద్, డిపో మేనేజర్ వెంకటమ్మ, గ్యారేజి ఇన్‌చార్జ్ ఎండీ యాసిన్ అలీ, ఆఫీస్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, కర్నాటి శ్రీనివాస్, చారి, శ్రీను, సంతోష్, సుజాత, సమత, భూషన్, గోపాల్, మల్లేషం, గణేష్, యాదయ్య, అనిల్, సుధాకర్, లింగయ్య, శంకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్థికసాయం అందజేత

కనగల్ : రేగట్టె గ్రామానికి చెందిన జక్కల శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను పగిడిమర్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించి రూ.26,700 ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా లింగాలగూడెం గ్రామానికి చెందిన మర్రి బయన్న అనారోగ్యతో మంగళవారం మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించి రూ.10 వేలుఅందజేశారు. బయన్న కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, పిల్లి రామరాజు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బయన్న భార్యకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ యంపల ధనమ్మసైదులు, కదిరె శ్రీశైలం తదితరులున్నారు.

పోలీసుల ఆర్థిక సహాయం

కనగల్ మండల కేంద్రానికి చెందిన ఎర్రజెల్ల వెంకన్న అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. వెంకన్నకు భార్య చిన్న పిల్లలు ఉండడంతో ఎస్‌ఐ అంతిరెడ్డి, పోలీస్‌స్టేషన్ సిబ్బంది మంగళవారం రూ.15000 ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి, కానిస్టేబుళ్లు రమేష్ నాయక్, దస్తగిరి తదితరులు ఉన్నారు.

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన సామ యాదిరెడ్డి సుంకరి యాదమ్మ, పాకాల లక్ష్మయ్య, గుర్రం జ్యోతిలు ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు ఆ గ్రామానికి చెందిన నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన కంచర్ల మల్లారెడ్డి ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున పంపిన ఆర్థిక సహాయాన్ని మంగళవారం ట్రస్ట్ ప్రతినిధులు అందజేశారు. సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుంకరి యాదగిరిగౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఉయ్యాల నాగరాజుగౌడ్, ఆవుల నర్సింహ, సాగర్ల భిక్షం, ఆడపు భిక్షం, లింగస్వామి పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అన్నదానం చేస్తున్న విద్యాసాగర్, గంగాధర్‌రావు

నకిరేకల్ : బీజీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ అన్నారు. బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్ రావు జన్మదినం సందర్భంగా నకిరేకల్‌లో మంగళవారం 1500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతి విద్యాసాగర్ మాట్లాడుతూ నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, గంగాధర్‌రావు బీజీఆర్ ఫౌండేషన్ నాలుగేళ్ల క్రితం స్థాపించి నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా ఉండడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, బీసీ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు సకినాల రవి, మర్రూరు సర్పంచ్ వలిశెట్టి స్వప్న, ఎంపీటీసీలు గాదగోని శ్రీలతకొండయ్య, వీరార్జున్‌రెడ్డి, సామ మల్లమ్మ పాల్గొన్నారు.

'మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ'

చండూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ మత రాజకీయాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం విమర్శించారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన దుర్ఘటనలకు ప్రధాని స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. నలపరాజు సతీష్ కుమార్, రామలింగయ్య, యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, రాములు, వెంకటేష్, దోటి వెంకన్న, రమేష్, ఉషయ్య, బండ మీది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేల పరిశీలన

చండూరు : పత్తి పంటలో ప్రస్తుతం వేరుకుళ్లు, వడలే తెగుళ్లు వస్తున్నాయని, ఈ తెగుళ్లు ఒక మొక్క ద్వారా ఇంకో మొక్కకు సోకి క్రమంగా పంట మొత్తం ఎండిపోతుందని ఏఓ మల్లేశ్ అన్నారు. చండూరు మండలం పుల్లెంల, శిర్దేపల్లి గ్రామాల్లో పత్తి, వరి చేలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ అనే మందును లీటర్ నీటిలో 5 గ్రాములు కలిపి తెగులు సోకిన మొక్కల చుట్టూ పోయాలన్నారు. ఏఈఓలు నాగార్జున, ధరణి, రైతులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో మెలగాలి

నాంపల్లి : మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమన్వయంతో మెలగాలని, సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంఈఓ గురువరావు అన్నారు. ఎంఆర్సీ భవనంలో పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో మండల, జిల్లాస్థాయి అధికారులు నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కె. సంజీవరావు, ఎం.నాగేశ్వర్‌రావు, యుగేంధర్, రఘువర్ధన్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాలాజీ, దామోదరాచారి, సైదులు, శ్రీను, సీఆర్పీ కేశవులు తదితరులు ఉన్నారు.

హైవే వెంట వాహనాలు నిలపకూడదు

రామగిరి(నల్లగొండ) : నార్కట్‌పల్లి అద్దంకి హైవే వెంట వాహనాలు నిలపకూడదని తిప్పర్తి ఎస్‌ఐ ఎస్.ధర్మా అన్నారు. మంగళవారం తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం వద్ద హైవే వెంట ఉన్న దాబా యజమానులతో ఎస్‌ఐ మాట్లాడారు. దాబాల ఎదుట హైవే పై మట్టి పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. లారీల యజమానులు రోడ్డు లోపలికి లారీలు నిలిపే బాధ్యత దాబా నిర్వాహకులు తీసుకోవాలన్నారు. అదేవిధంగా నిబంధనల ప్రకారం హైవే మీద తెలుపు రంగులో లైనింగ్‌లు వేయించాలని, రోడ్డుపక్కన సైన్ బోర్డులు పెట్టాలని హైవే నిర్వాహకులకు సూచించారు.

జీపీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

చండూరు : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఆలోపు పీఆర్సీ జీఓ 60 ప్రకారం రూ.19వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చండూరులో మంగళవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ శ్రీశైలం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్, కల్లు గీత సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జేరిపోతుల ధనంజయ, సీఐటీయూ మండల కన్వీనర్ మోగదాల వెంకటేశం, వరికుప్పల ముత్యాలు, గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు ఏర్పుల సైదులు, నాంపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా కార్మికుల సమ్మె కొనసాగింది. కట్టంగూర్ మండలం అయిటిపాములలో సర్పంచ్ రోజువారీ కూలీలతో పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు.



చండూరులో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

అర్ధనగ్నంగా మిషన్ భగీరథ కార్మికుల రిలే దీక్ష



జిల్లా కేంద్రంలో రిలే దీక్ష చేస్తున్న కార్మికులు

నల్లగొండ : మిషన్ భగీరథ కార్మికులు వారం రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. దీక్షలో భాగంగా పానగల్‌లోని మిషన్ భగీరథ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట కార్మికులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. నిమ్మనగోటి శ్రీను, బత్తుల వెంకటేశం, జంజిరాల శ్రీను, కృష్ణ, సంజీవరెడ్డి, జాని తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : మిషన్ భగీరథ కార్మికులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో పని చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొర్ల కాశీనాథ్, సభ్యులుగా వరికుప్పల శ్రీహరి, లక్ష్మయ్య, పూల శివ, వల్లపు శ్రీధర్, తిరుమణి మంగమ్మ, యాదగిరిలను ఎన్నుకున్నారు. పోలేని సత్తయ్య, కాశయ్య, ఉదయ్, వసంత, సైదమ్మ, నర్సింహ, ఏడుకొండల్, గిరి, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన



వరినాట్లు వేస్తున్న మందుల సామేల్

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారడంతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ నేతృత్వంలో గ్రామస్తులు మంగళవారం రోడ్డుపై ఉన్న గుంతలలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సామేల్ మాట్లాడుతూ రూ.600 కోట్లతో తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న నేతలు అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలన్నారు. శంకర్‌నాయక్, దర్శనం కృష్ణమూర్తి, సతీష్, పడాల వెంకన్న, రమేశ్, నాగినేని నాగయ్య, చివుట భిక్షపతి, సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లో గల శ్రీ ఉమామహేశ్వర స్వామి సహిత శ్రీ రామకోటి స్థూప ఆలయంలో అధిక శ్రావణ పూర్ణిమ సందర్భంగా మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, దివ్య జీవన సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బందారు వెంకటేశ్వర్లు, కోశాధికారి గుడిపాటి సత్యనారాయణ, శివకోటి నెహ్రూ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు